చదువు

ఈనాడు హైదరాబాద్, గురువారం జనవరి 11, 2018 8

నేషనల్ పూల్‌లో తెలుగు రాష్ట్రాలు కలవడం వల్ల 'నీట్' ద్వారా తేలిగ్గా మెడికల్ సీట్లు వచ్చేస్తాయనీ, సన్నద్ధతకు అంతగా కష్టపడాల్సిన అవసరం లేదనీ.. ఇలాంటి అపోహలు వ్యాపిస్తున్నాయి. వీటిని విశ్వసించి, అశ్రద్ధ చూపితే విద్యార్థులకు నష్ట దాయకమవుతుంది. జాతీయస్థాయి పోటీని తక్కువ అంచనా వేయకూడదు. ప్రతి భాస్థాయిని పెంచుకోవాల్సిందే. మారిన పరిస్థితుల్లో మెడికల్ సీటు సాధించటా నికి ఏ దిశలో 'నీట్'కు తయారవ్వాలో తెలిపే విశ్లేషణ ఇది!

స్థాయి పెంచుకుంటేనే నీట్ సీటు!

పి.వి.ఆర్.కె. మూర్తి
చైర్మన్, శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

మెడికల్ లేదా డెంటల్ కళాశాలల్లో సీటు సాధించాలనుకునే విద్యార్థులకు ఇప్పుడు మూడే పరీక్షలు మిగిలాయి. అవి నీట్-యూజీ, ఎయిమ్స్, జిప్‌మర్. వీటిలో అధిక సంఖ్యలో లేదా 98 శాతం వరకు విద్యార్థులు నీట్ రాయాలని కోరుకునేవారే ఉంటున్నారు. గత సంవత్సరం నీట్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరిగినప్పటికీ 371 9(డి) ఆర్టికల్ ఉండటం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు యూనివర్సిటీల (ఉస్మానియా, ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర) ప్రాతిపదికనే అడ్మిషన్లు జరిగాయి. అయితే ఈ సంవత్సరం 371 డి నుంచి మినహాయింపు కోరడం వల్ల విద్యార్థుల్లో లాభమని కొందరూ, నష్టమని కొందరూ విశ్లేషణలు చేస్తున్నారు. దీనికంటే విద్యార్థులు తయారీ విధానం పటిష్ఠం చేసుకోవటం లాభదాయకం.

మనం నేషనల్ పూల్‌లో కొన్ని సీట్లు ఇవ్వడం వల్ల తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల సీట్లు కొన్ని తగ్గవచ్చు. గవర్నమెంట్ కళాశాలల్లోని సీట్లలో మాత్రమే 15% ఇస్తే 450 సీట్లు (1900 + 1100), కేటగిరి- ఎ సీట్లు కూడా ఇవ్వాల్సి వస్తే దాదాపు 750 నుంచి 800 వరకు సీట్లు నేషనల్ పూల్‌కి ఇవ్వాలి.

దేశంలో మొత్తం 458 మెడికల్ కళాశాలలు ఉంటే వాటిలో 201 మాత్రమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు. వాటిలో సీట్లు 27880. వాటిలో 15 శాతం సీట్లు అంటే 4182 సీట్లు నేషనల్ పూల్‌లో ఉంటాయి. 2017లో తెలుగు విద్యార్థులు మొదట లక్ష ర్యాంకుల్లో 10 శాతం లోపు మాత్రమే ఉన్నారు. అది కూడా మొదటి 50,000 ర్యాంకులలో కొద్దిగా ఎక్కువ శాతం, లక్షలోపు ర్యాంకుల్లో తక్కువ శాతం ఉన్నారు. దానివల్ల నేషనల్ పూల్‌లో మనం సాధించుకోగల్గిన సీట్ల శాతం 8కి మించదు. 4182 సీట్లలో 8 శాతం అంటే సుమారుగా 335. వీటిలో జమ్ము-కశ్మీర్, అసోం, సిక్కిం లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో చేరేవారు ఉండకపోవచ్చు. ఆ సంఖ్య తీసివేస్తే 250 నుంచి 300 లోపు సీట్లు వచ్చినా కచ్చితంగా అధికసంఖ్యలో సీట్లు తగ్గిపోతాయి.

అయితే ఇది తొలి సంవత్సరం కాబట్టి విద్యార్థుల అవగాహన తక్కువ ఉండటం వల్ల సక్సెస్ రేటు తగ్గిందని చెప్పవచ్చు. రాబోయే కాలంలో జాతీయ స్థాయిలోని లక్షలోపు ర్యాంకుల్లో 15,000 పైన తెలుగు విద్యార్థులు సాధించుకోగల్గితే సీట్ల సంఖ్య పరంగా లాభనష్టాలు ఉండవు. అయితే ఈ విధానం వల్ల విద్యార్థులు వివిధ రాష్ట్రాలలోని ఉత్తమ కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించిన వారవుతారు. అదేవిధంగా 50,000 లోపు జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థులు వెలుపలి రాష్ట్రాల్లో మంచి కళాశాలల్లో సీటు సాధించుకునే అవకాశం పెరుగుతుంది.

మార్కులెన్ని? ర్యాంకు ఎంత?

గత సంవత్సరం ర్యాంకు, మార్కుల కటాఫ్ తెలంగాణ రాష్ట్రంలో కింది విధంగా ఉంది.

ఏ విద్యార్థులు?	ఎంబీబీఎస్ ర్యాంకు	మార్కులు	బీడీఎస్ ర్యాంకు	మార్కులు
ఓసీ బాలురు	21338	514	45292	456
ఓసీ బాలికలు	24191	513	45835	455
బీసీ-ఏ బాలురు	78621	401	100206	373
బీసీ-ఏ బాలికలు	78557	401	101848	371
బీసీ-బీ బాలురు	37826	472	59031	431
బీసీ-బీ బాలికలు	38147	471	59434	431
బీసీ-సీ బాలురు	67783	417	84876	393
బీసీ-సీ బాలికలు	70716	413	74505	407
బీసీ-డీ బాలురు	38082	471	52582	442
బీసీ-డీ బాలికలు	38188	471	53693	440
బీసీ-ఈ బాలురు	50803	446	65869	420
బీసీ-ఈ బాలికలు	50200	447	67008	419
ఎస్‌సీ బాలురు	90924	382	115735	355
ఎస్‌సీ బాలికలు	90872	385	115741	355
ఎస్‌టీ బాలురు	69779	414	144073	350
ఎస్‌టీ బాలికలు	70741	413	168782	304

ఇది ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో కేటగిరీ-ఎ సీట్ల కటాఫ్ కాబట్టి విద్యార్థి ఈ మార్కుకి కనీసం 20 మార్కులు పెంచుకోవడం అంటే ఇప్పుడు ఓసీ విద్యార్థులకు 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో కనీసం 540 మార్కులపైన సాధించుకోవాలి. ఇప్పటినుంచి సూక్ష్మరీతిలో ప్రణాళిక వేసుకొని, ఆచరించే విద్యార్థికి మాత్రమే విజయం చేకూరే అవకాశం ఉంది.

పోటీ బాగా పెరుగుతుంది

సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది కాబట్టి పోటీ ఇంకా బాగా పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థి గత సంవత్సరపు కటాఫ్ మార్కు కంటే ప్రతి కేటగిరీలోనూ 20 మార్కుల వరకు పెంచుకోవడానికి ప్రణాళిక తయారుచేసుకోవాలి.

నీట్ పీజీ ప్రవేశాలకు ఇతర రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య ఎక్కువ. ఇంకా నేషనల్ పూల్‌కి 50 శాతం సీట్లు కేటాయింపు ఇవ్వాలి కాబట్టి తెలుగు రాష్ట్రాల విద్యార్థులు బాగా లాభపడతారు.

బయాలజీలో అదనం

బయాలజీలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలోని వాక్యాలకు మాత్రమే పరిమిత మైతే 90 ప్రశ్నల్లో 75 ప్రశ్నల వరకు సమాధానాలు గుర్తించవచ్చు. మిగిలిన 15 ప్రశ్నలు కూడా బాగా రాయాలంటే అదనంగా కొంత చదవడం, పరీక్షల రూపంలో కొత్త ప్రశ్నలకు జవాబు గుర్తించడం అభ్యాసం చేసుకోవాలి.

బయాలజీలో 12 వ తరగతిలోని జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, ఎకాలజీ; 11వ తరగతిలోని ప్లాంట్ ఫిజియాలజీ, హ్యూమన్ ఫిజియాలజీలకు ప్రాధాన్యం ఇచ్చి పునశ్చరణ చేసుకోవాలి. వీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చి చదివిన విద్యార్థి అదనంగా 20 మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఫిజిక్స్‌లో నూరుశాతం

ఈ సబ్జెక్టులో ద్వితీయ సంవత్సరపు పుస్తకం నుంచే అధిక ప్రశ్నలుంటాయి. ప్రాధాన్యతా క్రమం కూడా అలాగే ఉండాలి. ద్వితీయ సంవత్సరపు సిలబస్‌లోని ఎలక్ట్రిసిటీ, ఆధునిక భౌతికశాస్త్రం (మోడర్న్ ఫిజిక్స్) బాగా చేయగల్గితే దాదాపు 50 శాతం ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు. మోడర్న్ ఫిజిక్స్ చదవటం వల్ల అది కెమిస్ట్రీకి కూడా బాగా ఉపయోగం. దానిలోని ఆటమ్, న్యూక్లియై పాఠ్యాంశాలు ఫిజిక్స్, కెమిస్ట్రీ.. దేనికైనా సరిపోతాయి. తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశమూ ఏర్పడుతుంది.

భౌతిక శాస్త్రంలో విద్యార్థి కొంత ఇబ్బంది అని చెప్పేది ప్రథమ సంవత్సర సిలబస్‌లోని యాంత్రిక శాస్త్రం (మెకానిక్స్). అయితే వాటిలో ఫార్ములాలు కంఠస్థం చేయడం కాకుండా, విశ్లేషణతో విషయాన్ని అర్థం చేసుకోగల్గితే మిగిలిన వాటికంటే మెకానిక్స్‌లోనే ఎక్కువ మార్కులు సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫిజిక్స్‌లో ఇచ్చే 45 ప్రశ్నల్లో సాధారణ విద్యార్థి కూడా 35 ప్రశ్నలకు పైగా జవాబులు గుర్తించే విధంగానే ప్రశ్నపత్రాలు ఉంటున్నాయి. కనీసం 180 మార్కులకు జరిగే ఫిజిక్స్ తుది పరీక్షలో కనీసం 120 - 140 మార్కుల వరకు సాధించుకునే దిశలోనే విద్యార్థి అభ్యాసం చేయాలి. అవగాహనతో, విశ్లేషణతో తయారయ్యే ఏ విద్యార్థి అయినా భౌతిక శాస్త్రంలో నూరు శాతం మార్కులు అంటే 180కి 180 మార్కులు సాధించుకునే అవకాశం ఉంటుంది.

కెమిస్ట్రీలో గరిష్ఠంగా..

రసాయన శాస్త్రంలో కూడా ద్వితీయ సంవత్సర సిలబస్‌కే ప్రాధాన్యం బాగా ఎక్కువ. దీనిలో విద్యార్థులు లెక్కలు ఎక్కువగా ఉంటున్నాయనే అపోహతో ఉంటున్నారు. మొత్తం 45 ప్రశ్నల్లో 35 నుంచి 40 ప్రశ్నల వరకు సిద్ధాంతపరమైన ప్రశ్నలు మాత్రమే ఉంటున్నాయి. కర్బన, అకర్బన, భౌతిక రసాయన శాస్త్రాల్లో కూడా ప్రశ్నలు దాదాపు సమ విభజనతో అంటే ఒక్కో విభాగం నుంచి 15 ప్రశ్నల వరకు వస్తున్నాయి.

అకర్బన రసాయన శాస్త్రంలో గుర్తుంచుకునే ప్రశ్నలే అధికం. వాటిలో పీ, డీ, ఎఫ్ బ్లాక్ మూలకాల్లో వస్తున్నాయి. కో ఆర్డినేషన్ కాంపౌండ్స్‌లోని ప్రశ్నలను కూడా కొంత విశ్లేషించి అర్థం చేసుకోవడం మేలు. కర్బన రసాయన శాస్త్రంలో నేమ్‌డ్ రియాక్షన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చి వాటిని ఒకే దగ్గర విద్యార్థి నోట్ తయారుచేసుకోగల్గితే తుది పరీక్షల్లో బాగా ఉపయోగపడతాయి.

మెకానిజంలో రియాక్షన్స్, ప్రొడక్ట్స్ గురించే కాకుండా కెటలిస్ట్ రోల్, ఇంటర్మీడియట్ కాంపౌండ్స్ ఏమి తయారవుతాయి అనేదానిపై విశ్లేషణ అవసరం. భౌతిక రసాయన శాస్త్రంలో ఇచ్చే ప్రాబ్లమ్స్‌లో కూడా సింపుల్ అప్లికేషన్స్ మాత్రమే ఉంటున్నాయి. దీనిలో సాలిడ్ స్టేట్, సొల్యూషన్స్‌పై కొంత ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసాయనశాస్త్రం విశ్లేషణతో తయారైన విద్యార్థి సులభంగా 180 మార్కులకు 160 మార్కుల వరకూ సాధించుకునే అవకాశం ఉంటుంది.

పోటీ పరీక్షల పరంగా ఇంటర్మీడియట్ మార్కులకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ఈ జనవరి, ఫిబ్రవరి నెలలు విద్యార్థి ద్వితీయ ఇంటర్‌తోపాటు ఆ సిలబస్‌లోనే పోటీ పరీక్షలకు కూడా తయారు కాగలిగితే మంచిది. మార్చి 14వ తేదీకి ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి కాబట్టి తర్వాత ప్రథమ సంవత్సర సిలబస్ పునశ్చరణ చేసుకొని నమూనా పరీక్షలు రాయవచ్చు. అవి కనీసం 10 నుంచి 12 వరకు రాయగల్గితే నీట్‌లో మెరుగైన ర్యాంకు దిశలో ముందుకు సాగుతున్నట్టే అవుతుంది!

సారాంశం ముఖ్యం

తెలుగు విద్యార్థులు ఇంతవరకు ఎంసెట్ టీచింగ్ విధానంలోనే కొనసాగుతున్నారు కాబట్టి పాఠ్యపుస్తకంలోని ప్రతి వాక్యాన్నీ వీలైనన్ని ఎక్కువసార్లు చదవాలనే అపోహతోనే ఉంటున్నారు. కానీ విద్యార్థులు వాక్యంలోని పదాలు అలాగే నేర్చుకోవాలనే విధానాన్ని వదిలిపెట్టి ఆ పేజీలోని సారాంశం ఏంటి అనేది సంపూర్ణంగా గ్రహించాలి. దాన్ని ప్రశ్నల రూపంలో తయారుచేసుకొని అభ్యాసం చేసినప్పుడే కావాల్సిన మార్కులు సాధించుకోవచ్చు.

తయారీ విధానంలో ఇప్పటివరకు భౌతిక శాస్త్రానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులు చదువుతున్నారు. దాంతోపాటు బయాలజీ, కెమిస్ట్రీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. సీటు సాధించాలంటే 720 మార్కులకు 540 మార్కుల వరకు సాధించాలి. అది జరగాలంటే ముందుగా విద్యార్థి 360 మార్కులకు జరిగే బయాలజీలో 340 మార్కుల వరకు సాధించగల్గాలి.

eager beaver... ఎవరు?

విరామం లేకుండా అదేపనిగా టీవీ చూస్తుంటారు కొందరు. వీరి అలవాటును చెప్పటానికి ఇంగ్లిష్‌లో ఒక కొత్త వ్యక్తీకరణ వచ్చింది. దాని గురించి ఉదాహరణతో తెలుసుకుందామా?

ENGLISH LANGUAGE SKILLS

Ganesh: The minute Govind returns from college he sits in front of the TV and doesn't think of any other activity (కాలేజీ నుంచి వచ్చీ రాగానే గోవింద్ టీవీ ముందు కూర్చుంటాడు. ఇంకే పనీ చేయడు).

Shanmukh: Yea, that is a well-known fact. He often indulges in binge watch. He has become a TV addict (అవును. అది అందరికీ తెలిసిన విషయమే. అదేపనిగా టీవీ చూస్తుండటం అతని వ్యాపకం. అతను టీవీ వ్యసనపరుడయ్యాడు).

Ganesh: Krishna is the exact opposite of Govind. He works very hard (కృష్ణ గోవింద్‌కు పూర్తి వ్యతిరేకం. అతను చాలా కష్టపడి చదువుతాడు).

Shanmukh: That is true. Krishna is an eager beaver. He is highly motivated and after engineering, he intends to go to the US (అది నిజమే. కృష్ణ చాలా ఉన్నత లక్ష్యాల కోసం శ్రమిస్తాడు. ఇంజినీరింగ్ తర్వాత అమెరికాకు వెళ్లాలని అతని ఉద్దేశం).

ఎం. సురేశన్

Ganesh: But I think it is going to be difficult for him. And I am afraid, Trump is in the way (అయితే అది అతనికి కష్టమవుతుందనుకుంటా. ట్రంప్ అడ్డుగా ఉన్నాడు కదా).

Shanmukh: But Krishna is highly skilled, and getting a job will not be very difficult for him (అయితే కృష్ణకు మంచి నైపుణ్యం ఉంది కదా. అతనికి ఉద్యోగం తెచ్చుకోవడం పెద్ద కష్టమేం కాదు).

Ganesh: But I am afraid it is going to be a wild goose chase for him, anyway (కానీ నా అనుమానం.. ఏదేమైనా అతని కిది ఫలితం లేని శ్రమే అవుతుందని).

Shanmukh: Let us wish him good luck anyway. He is quite hard working and he will be rewarded (అతన్ని అదృష్టమే వరిస్తుందని ఆశిద్దాం. అతను చాలా కష్టపడతాడు, దానికి తగిన ఫలితం తప్పక ఉంటుంది).

Ganesh: Anyway, let us wish him the best of luck (అతన్ని అదృష్టమే వరించాలని కోరుకుందాం).

Now let us look at the expressions above

1. Binge watch = Watching the TV without rest or break. This is a new expression (విరామం లేకుండా టీవీ చూస్తుండటం).

Prabhakar: We rarely see Bhaskar coming out and mixing with us these days (భాస్కర్ బయటికొచ్చి మనతో కలవడం చాలా అరుదైంది).

Peter: Ever since he bought the TV, he has been indulging in binge watch. He has put on a lot of weight too (అతను టీవీ కొన్నప్పటి నుంచి అదేపనిగా టీవీ చూస్తూ కూచుంటాడు. అతను చాలా లావెక్కాడు కూడా).

2. An eager beaver = A highly motivated person, working very hard (గొప్ప ఉద్దేశాల కోసం శ్రమించేవాళ్లు).

Madhav: Our friend Chalam is very hardworking. Right from his childhood he has been so. He is good at games too (మన స్నేహితుడు చలం చాలా కష్టపడి పనిచేస్తాడు. చిన్నప్పటి నుంచీ అతనంతే. ఆటల్లోనూ గొప్పవాడే).

Ramamurthy: Yea, I agree with you. He doesn't waste even a single minute. He is what they call an eager beaver (అవును, నీతో నేనంగీకరిస్తా. ఒక్క క్షణం కూడా వృథా చేయడు. చాలామంది అంటారు చూడు గొప్ప ఉద్దేశాలు కలవాడని, అతను అలాంటివాడు).

3. A wild goose chase = An attempt without any result (ఫలితం లేని విపరీత ప్రయత్నం).

Raghav: He is trying his best to save enough money to build a house. He has been doing it for the past three years (ఇల్లు కట్టుకోవడానికి అతను డబ్బు కూడబెట్టడానికి గొప్ప ప్రయత్నమే చేస్తున్నాడు. మూడేళ్లుగా ఆ పని మీదే ఉన్నాడు).

Ajay: I am sure he will succeed in that. It is not going to be a wild goose chase for him. He is quite careful in matters of money (అతను దాంట్లో విజయం పొందుతాడని నా నమ్మకం. అది ఫలితం లేని ప్రయత్నం కాబోదు అతని విషయంలో. డబ్బు విషయంలో అతను చాలా జాగ్రత్తపడతాడు).

నేరుగా ఆర్కిటెక్చర్‌లోకి.. నాటా

నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా) ప్రవేశ ప్రకటన వెలువడింది. ఆర్కిటెక్చర్‌ను కెరియర్‌గా ఆశించినవాళ్లు ఈ పరీక్ష ద్వారా ఉన్నత సంస్థల్లో ప్రవేశం పొందవచ్చు. భారతీయ ఆర్కిటెక్చర్ కౌన్సిల్ (సీఓఏ) ఈ పరీక్షను నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా దాదాపు 450 సంస్థలు నాటా స్కోర్‌తో ప్రవేశాలకు అనుమతిస్తున్నాయి. ఎన్ఐటీలు, ఐఐటీలు మినహాయిస్తే దేశంలోని మిగతా అన్ని ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నాటాలో పొందిన స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఈ స్కోర్‌తో బీఆర్క్ కోర్సులో ప్రవేశం కల్పిస్తున్నాయి. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మ్యాథ్స్‌లో పరిజ్ఞానం, వివిధ రకాల చిత్రాలు, ఆకృతులు గీయడంలో నైపుణ్యం ఉన్నవాళ్లు ఈ పరీక్షలో రాణించగలరు.

విద్యార్హత: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేసి ఉండాలి. ఈ కోర్సుల్లో ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష ఇలా...

మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 2 భాగాలు ఉంటాయి. పార్ట్-ఎకు 120 మార్కులు కేటాయించారు. ఈ విభాగాన్ని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో మ్యాథ్స్ నుంచి 20, జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 40 ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. పార్ట్-బి కూడా 90 నిమిషాల వ్యవధిలోనే ఉంటుంది. అయితే దీనికి మార్కులు 80. ఎ-4 పరిమాణమున్న పేపర్‌పై రెండు ఊహాత్మక చిత్రాలు / ఆకృతులు గీయాలి. ఒక్కో చిత్రానికి 40 చొప్పున మార్కులు ఉంటాయి.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల ప్రారంభ తేదీ: జనవరి 16

దరఖాస్తు ఫీజు: రూ.1800. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500.

దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 2

హాల్ టికెట్లు: ఏప్రిల్ 2 నుంచి అందుబాటులో ఉంటాయి.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 29 (ఆదివారం) ఉదయం 10:30 గం. నుంచి మధ్యాహ్నం 1:30 గం. వరకు

ఫలితాలు: జూన్ 1న ప్రకటిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం,

అర్హత సాధించాలంటే...

పార్ట్-ఎలో కనీసం 25 శాతం అంటే 120కి 30 మార్కులు పొందాలి. అలాగే పార్ట్-బిలోనూ 25 శాతం మార్కులు (80 కి 20) పొందడం తప్పనిసరి ఇలా అర్హత మార్కులు సాధించిన అభ్యర్థుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

రామగుండం ఫర్టిలైజర్స్ & కెమికల్స్ లిమిటెడ్

✦ మేనేజ్‌మెంట్ ట్రైనీ: 61 పోస్టులు (కెమికల్-35, మెకానికల్ -10, ఎలక్ట్రికల్-08, ఇన్‌స్ట్రుమెంటేషన్-06)

అర్హత: బీఈ/బీటెక్. గేట్-2016 ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఎంపిక:** గేట్ స్కోరు, ఇంటర్వ్యూ. **చివరితేది:** 09.02.2018. **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

సీడాక్, నోయిడా

✦ ఖాళీల సంఖ్య: 53
1) ప్రాజెక్ట్ మేనేజర్: 03
2) ప్రాజెక్ట్ ఇంజినీర్: 39
3) ప్రాజెక్ట్ సపోర్ట్ స్టాఫ్: 11 **అర్హత:** పీహెచ్‌డీ (సైన్స్/ ఇంజినీరింగ్/ టెక్నాలజీ) (లేదా) బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ ఎంసీఏ, డిగ్రీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఎంపిక:** ఇంటర్వ్యూ. **చివరితేది:** 31.01.2018.
వెబ్‌సైట్: https://cdac.in

వైజాగ్ స్టీల్ ప్లాంట్

✦ మేనేజ్‌మెంట్ ట్రైనీలు
విభాగాలు: హెచ్ఆర్, మార్కెటింగ్, టెక్నికల్ (ఎలక్ట్రికల్/ మెకానికల్/ మెటలర్జీ).
అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీతో ఎంబీఏ/ పీజీ డిప్లొమా ఉండాలి, ఇంజినీరింగ్ డిగ్రీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
దరఖాస్తు ప్రక్రియ: 15.01.2018 - 14.02.2018.
వెబ్‌సైట్: www.vizagsteel.com

వాక్‌ఇన్

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్

✦ సీనియర్, జూనియర్ రెసిడెంట్: 23 పోస్టులు
అర్హత: ఎంబీబీఎస్. సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఎంబీబీఎస్‌తోపాటు పీజీ డిగ్రీ/డిప్లొమా **వాక్‌ఇన్ తేది:** 17.01.2018 **సమయం:** ఉ.9.00 గం.
వెబ్‌సైట్: www.nlcindia.com

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.